క్లుప్తంగా

కంపోస్టు యార్డు వ్యర్థాలు తొలగించాలి



తెనాలిరూరల్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డులో నుంచి వస్తున్న వేస్టేజీ వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని డంపింగ్ యార్డు చుట్టు పక్కల పొలాల రైతులు తెలియజేశారు. శనివారం డంపింగ్ యార్డును సందర్శించిన వారు అక్కడ పరిస్థితులను, తమ ఇబ్బందులను విలేకర్ల ఎదుట ఏకరువు పెట్టారు. ఎంతో కాలంగా ఇక్కడ ఉన్న డంపింగ్ యార్డు గోడలు పడిపోయి దాంట్లోని వ్యర్థాలు, వ్యర్థాల నీరు తమ పొలాల్లోకి వచ్చి చేరుతుందన్నారు. అందువల్ల తాము పంటలు కూడా వేయలేక పోతున్నామని చెప్పారు. స్పందనలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. త్వరలో సాగు ప్రాంభకానున్న నేపథ్యంలో అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురి అరెస్ట్



తెనాలిరూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను తెనాలి ఎస్‌ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం వెల్లడించారు. పట్టణ మారిస్‌పేట స్వతంత్ర విహార్ హోటల్ సమీపంలో 96 మద్యం క్వార్టరు సీసాలను తరలిస్తూ ముగ్గురు యువకులు ఎస్‌ఈబీ అధికారులకు చిక్కారు. పరిమితికి మించి తీసుకెళుతుండడంతో వారిని ప్రశ్నించగా మద్యం దుకాణంలోని సేల్స్ మ్యాన్ సహకరించినట్టు తెలిపారు. దీంతో నిందితుడితో పాటు సేల్స్‌మ్యాన్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ వివరించారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలిరూరల్: హైదరాబాద్ జేఎన్టీయూ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ డైరెక్టర్ కన్నెగంటి రమేష్ బాబు జన్మదిన వేడుకలను శనివారం స్థానిక మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమంలో నిర్వహించారు. ఆశ్రమ వాసులకు స్వీట్స్ పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది పొన్నం విజయకుమార్ మాట్లాడుతూ దేశ అంతర్గత బాహ్య భద్రతా వ్యవహారాల నిపుణులు, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాలపై పలు దేశాలకు సలహాదారుడు, భారత కోస్టల్ ప్రాంత రక్షణా వ్యవహారాలపై రక్షణాధికారులకు చెన్నైలో శిక్షణా శిబిరం నిర్వహించిన కన్నెగంటి రమేష్ బాబు జన్మదిన వేడుకలు సందర్భంగా ఇలా వృద్ధాశ్రమంలో ఆశ్రమవాసులకు అన్నదానం చేయటం తల్లిదండ్రుల గొప్ప మనస్సుకు నిదర్శనమని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కన్నెగంటి గోపీచంద్, తోట సూరిబాబు, కన్నెగంటి మణిబాబు, తన్నీరు శివశంకర్, దంతాల కిరణ్ కుమార్, సుంకర శ్రీధర్, దంతాల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఐతానగర్‌లో కార్డన్ సెర్చ్



తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎటువంటి ఘర్షణలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.ఇందులో భాగంగా తెనాలి పట్టణ ఐతానగర్‌లో శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, వన్ టౌన్ సీఐ జి. దశరథరామారావు, రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వర రావు, ఇతర ఎస్ఐలతో పాటు దాదాపు 70 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. పోలీసులు గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాలో ఒకటైన ఐతానగర్‌లోని నివాసాలతో పాటు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడ వద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైక్‌లలో హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలను లేని 25 బైక్‌లు సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని రూరల్ సీఐ సుధాకర్ తెలియజేశారు.

ఇక 48 గంటలే గడువు

- సార్వత్రిక ఎన్నికలపై తీర్పుకు ఇక రెండు రోజులే గడువు
- 4న ఈవీఎంల సాక్షిగా వెల్లడి కానున్న ప్రజాతీర్పు
- పోలింగ్ సరళితో గెలుపు తమదేనని వైఎస్సార్‌సీపీ వర్గాల ధీమా



పోలింగ్ రోజున ఓటు కోసం బారులు తీరిన ఓటర్లు

తెనాలి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ తొలగేందుకు మరో రెండు రోజులే వ్యవధి. ఇన్ని రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు ఆ రోజే తెర పడనుంది. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో విజయ బావుటాను ఎవరు ఎగరేసేది ఈవీఎంల సాక్షిగా తేటతెల్లం కానుంది. ఇన్నాళ్ల జరిగిన వాదోపవాదాలు, సవాళ్లు, ప్రతి సవాళ్లకు ఫుల్‌స్టాప్ పడనుంది. ముఖ్యంగా చైతన్యవంతమైన తెనాలి నియోజకవర్గంలో ఫలితంపై రాజకీయవర్గాలు ఎంతో ఆసక్తిగా ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడి ఫలితానికి అనుగుణంగానే రాష్ట్రవ్యాప్తంగా విజేతలు ఎన్నికవుతుండటం ఆనవాయితీ.

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ఈనెల 4వ తేదీ జరగనుంది. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలో భాగమైన తెనాలి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోనే నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. 273 పోలింగ్ కేంద్రాలున్న తెనాలి నియోజకవర్గం ఓట్ల లెక్కింపుకు 20 రౌండ్లు పడుతుంది. ఓట్ల ఫలితాల కోసం ఎంతగానో ఎదురుచూస్తూ, ఏరోజుకారోజు లెక్కలేసుకుంటూ గడుపుతున్న ఆశావహులు, పందెంరాయుళ్లు, పార్టీల కార్యకర్తలు/అభిమానులు, 'హమ్మయ్య.. ఇక దగ్గరకొచ్చేశాం' అనుకుంటూ ఉత్సాహపడుతున్నారు. ఎన్నికల్లో పోలింగ్‌కు, ఓట్ల లెక్కింపుకు మధ్య మూడు వారాలకు పైగా వ్యవధి ఉంది. అధికార వైఎస్సార్ సీపీ ఒకవైపు, మూడుపార్టీల కూటమి మరోవైపు తలపడిన విషయం తెలిసిందే. పోటాపోటీగా జరిగిన ఎన్నికల ప్రచారం, అంతే పోటీగా పోలింగ్ జరగటం ఇంతటి ఉత్కంఠ, ఉద్విగ్నతకు కారణమని చెప్పొచ్చు. ఈ పర్యాయం కొత్తగా ఓటరుగా నమోదైన 4 వేల మందికి పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. తమ తొలి ఓటు సఫలమైందా? లేదా? అనే ఆసక్తి సహజంగానే వారిలో నెలకొనివుంది.

తెనాలి నియోజకవర్గంలో 2,67,624 మంది ఓటర్లకుగాను 76.16 శాతం అంటే 2,03,825 మంది ఓటు హక్కు వినియోగించుకున్న వైనం తెలిసిందే. 2019 ఎన్నికలతో పోల్చుకుంటే ఓటింగ్ శాతం స్వల్పంగా తగ్గినట్టు కనిపిస్తున్నా, అప్పటికన్నా దాదాపు 600 మంది ఓటర్లు అధికంగా ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో 77.26 శాతం అంటే 2,03,207 మంది ఓటు వేశారు. 2014 ఎన్నికలో 79 శాతం పోలింగ్ నమోదుకాగా అప్పట్లో 1,91,391 ఓటర్లు ఓటు వేశారు. గత ఎన్నికలతో పోలిస్తే ఓటుచేసినవారి సంఖ్య పెరిగినట్టు కనిపిస్తున్నా వాస్తవంగా ఉన్న ఓటర్లలో 63,744 మంది ఓటు చేయలేదని తెలిసిందే. పట్టణంతో పోలిస్తే, తెనాలి రూరల్, కొల్లిపర మండలాల్లో అత్యధిక శాతం ఓటర్లు ఓటు వేశారు. పట్టణంలో 69.11 శాతం ఓట్లు పోలవగా, రూరల్ మండలంలో 84.78 శాతం, కొల్లిపర మండలంలో 86.66 శాతం ఓటు వేశారు. 2019 ఎన్నికల్లో పట్టణంలో 69 శాతం ఓట్లు పోలవగా, తెనాలి రూరల్ మండలంలో 88 శాతం, కొల్లిపర మండలంలో 91 శాతం ఓట్లు పోలయ్యాయి. అంటే గత ఎన్నికలకన్నా పట్టణంలో స్వల్పంగా ఓట్లు పెరగ్గా, రూరల్ మండలం, కొల్లిపర మండలాల్లో ఓటింగ్ శాతం తగ్గింది. పోలింగ్ సరళి రాష్ట్రంలో అధికార పార్టీకే అవకాశమన్న సంకేతాలనిచ్చింది. గత ఎన్నికల్లో గెలిచిన దగ్గర్నుంచి అన్నాబత్తుని శివకుమార్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వచ్చారు. ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన సంక్షేమ పథకాల లబ్ధిని నియోజకవర్గంలో గరిష్టంగా అందించారు. అయిదేళ్లలో రూ.1800 కోట్ల సంక్షేమాన్ని నేరుగా పేద, మధ్యతరగతి ప్రజల ఖాతాల్లో జమచేయించారు. పేదలకు ఇళ్లస్థలాల పథకంలో 27 వేలమందికి పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను ఇవ్వటం మరో రికార్డు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దాదాపు 20 నెలలపాటు ప్రతి ఇంటి తలుపు తట్టారు. ఆప్యాయంగా పలకరించి, అందిన సంక్షేమాన్ని చెప్పారు. ఇతర సమస్యలను ఆరా తీశారు. కరోనా రోజుల్లో బాధితులకు అందించిన సేవలు, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవటం తన గెలుపునకు కలిసొస్తాయనేది శివకుమార్ ధీమా. ఇందుకు తగ్గట్టుగానే పోలింగ్ సరళి కనిపించటంతో విజయంపై ధీమాతో ఉన్నారు.

కూటమి అభ్యర్థిగా పోటీచేసిన జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వ్యవహారశైలి, నామినేషను దాఖలుకు ముందు నుంచీ గెలిచేసినట్టే ఉందని కార్యకర్తలు చెప్పుకున్నారు. ఆయన సతీమణి నాదెండ్ల మనోహరం వైఖరి కూడా ఇందుకు తగ్గట్టే ఉందంటున్నారు. ఇద్దరూ కూడా ఎన్నికల్లో గెలిచేశామనీ, అధికారం తమదేనని అవకాశం వచ్చిన చోటల్లా అతిశయం ప్రదర్శించారు. వాస్తవానికి పదేళ్ల అధికారంలో ఉన్న నాదెండ్ల మనోహర్, 2014లో కాంగ్రెస్ తరపున, 2019లో జనసేన తరపున పోటీచేసిన మనోహర్, ఆయా ఎన్నికల్లో ఓటమి తర్వాత స్థానికంగా అందుబాటులో లేరు. కరోనా టైములోనూ తెనాలి ఎలా ఉందని చూసిందీ లేదంటూ అధికార పార్టీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల ప్రచారంలో ఊరూవాడా చాటిన విషయం తెలిసిందే.

మళ్లీ 2024 ఎన్నికలకు రెండు నెలల ముందు వచ్చి పోటీచేయటంపైనా ఆయన విమర్శలు గుప్పించారు. ప్రజలకు అందుబాటులో ఉండని ప్రతిపక్ష కూటమి అభ్యర్థి ప్రతికూల వైఖరీ కూడా తమకు కలిసొస్తుందని వైఎస్సార్ సీపీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. మెజార్టీ సర్వేలు సైతం ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయంటూ గుర్తు చేస్తున్నారు.

కాకుమాను పుష్పావతీదేవికి నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు 'గానవిశారద' కాకుమాను పుష్పావతీ దేవి 18వ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీ మహాత్మా గాంధీ సేవాశాంతి ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పుష్పావతీ దేవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచారు. సంగీత విద్వాంసురాలుగా, స్వాతంత్ర్యయోధురాలుగా ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కుర్రా వెంకటేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, యోగాచార్య పి.కుటుంబరావు, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

'ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ వద్దు'

తెనాలి: ఇళ్ల మధ్యలో సెల్‌టవర్ నిర్మాణం వద్దంటూ రూరల్ మండలం మల్లెపాడు గ్రామానికి చెందిన పలువురు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మల్లెపాడు ఎస్టీ కాలనీకి చెందిన ఒకరు సెల్ టవర్ నిర్మాణం ఏర్పాటుకు సంబంధిత కంపెనీతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మాణం వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతాయని, వెంటనే నిలిపివేయించాలని కోరుతూ గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కారుమంచి రవి కుమార్, ఎన్.శివరామకృష్ణ, జె.మల్లికార్జునరావు, కె రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గేటు సమీపంలోని మురుగు కాల్వలో ఓ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని కాల్వలో నుంచి బయటకు తీయించారు. వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జయహనుమంత జ్ఞానగుణవందిత...

కన్నులపండువగా హనుమజ్జయంతి



హారతి తీసుకుంటున్న శివకుమార్



జెండా ఊపి హనుమాన్ శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్



మారీసుపేటలో స్వామి వారి అలంకారం



నెహ్రూరోడ్డులో నాగవల్లీ దళార్చన



మారీసుపేట అప్పలస్వామి గుడిలో..



నాజరుపేట లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో హనుమకు అభిషేకం

తెనాలి: హనుమజ్జయంతి పర్వదినాన్ని శనివారం పట్టణ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్థానిక బోసురోడ్డులోని హనుమాన్‌చౌక్‌లో శ్రీ చిట్టి ఆంజనేయస్వామి మందిరంలో స్వామి వారి శతజయంతి మహోత్సవాలను త్రయాహ్నిక దీక్షతో హనుమజ్జయంతి రోజునే ప్రారంభించారు. మూడురోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి విశేష నాగవల్లీ సహస్ర నామార్చనను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు శ్రీ లక్ష్మి కూచిపూడి నృత్య కళాకేంద్రం నాట్యాచార్య ఎ.వెంకట లక్ష్మీ శిష్య బృందంచే హనుమాన్ చాలీసా నృత్య ప్రదర్శన నిర్వహించారు. రికార్డుస్థాయిలో వందమంది నృత్యకళాకారులచే ఈ ప్రదర్శన సాగింది. ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, ఆలయ అర్చకులు దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ్ పర్యవేక్షించారు. మధ్యాహ్నం శ్రీశైల భక్త సేవాసమితిచే లడ్డూ ప్రసాద పంపిణీ చేశారు. ఎ.సుబ్బయ్య, కేబీఎన్ గుప్త, టి.కృష్ణ, రవీంద్ర, సత్యం, పాండు, భాస్కర్, పద్మ, శాంత సహకరించారు.

షరాఫ్ బజారులోని శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో 16వ వార్షిక లక్ష హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీ హనుమజ్జయంతి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 11వతేదీ వరకూ జరిగే ఉత్సవాల్లో తొలిరోజైన శనివారం స్వామికి పంచామృత స్నపన, విశేష అర్చనలు చేశారు. సాయంత్రం విష్వక్సేనపూజ, లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, రొంపిచర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాజరుపేటలోని లక్ష్మీనృసింహస్వామి, శ్రీ అభయ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలు వైభవంగా చేశారు. శ్రీ అభయ వీరాంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అనంతరం విశేష అలంకరణతో ఉన్న స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. ఈ నెల 5వ తేదీ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవ కల్యాణం భక్తులచే జరిపిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

గంగానమ్మపేటలో సాలిగ్రామం ట్రస్ట్‌ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ సువర్చల సమేత దాసాంజనేయ అమ్మవార్లకు సుప్రభాత సేవ విశేష, ఫలరసాలతో అభిషేకం, విశేష సిందూర అర్చన స్వామి వారికి కదళీఫలార్చన నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర భజన మండలిచే శ్రీరామ సంకీర్తన అర్చన సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అయోధ్య శ్రీ బాలరాముడి వైభవంపై బాల స్వామీజీ ప్రవచనాన్ని చెప్పారు. మహా మంగళ హారతి, తీర్థప్రసాద వితరణ చేశారు. శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ బోర్డు చైర్మన్ నంబూరు వెంకట కష్ణమూర్తి, మఠం సంయుక్త కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, పెనుగొండ వెంకటేశ్వరరావు, గుడివాడ శివప్రసాద్, కోన నాగేశ్వరరావు, మురికిపూడి కాశీ విశ్వనాథం, సామా కరుణాకర్ పాల్గొన్నారు.

మారీసుపేటలోని శ్రీ బాల త్రిపుర సుందరి సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో హనుమత్ జయంతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం శ్రీ హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు స్వామి వారికి పంచామృతాభిషేకం, చూత ఫలార్చన నిర్వహించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మ రాజు, తాడిపర్తి హరి ప్రసాద్ పర్యవేక్షించారు.

మారీసుపేట మఠం బజార్‌లో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి మందిరంలో హనుమాన్ జన్మదిన ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామికి పంచామృత, ఫల, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం సువర్చలా హనుమత్ కల్యాణం ఎంతో కన్నుల పండువగా జరిగింది. పట్టణ 34వ వార్డులోని బాలాజీరావుపేటలోని శ్రీ పట్టాభిరామస్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ప్రసన్నాంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకాలు జరిపారు. వార్డు కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు మారుతి పర్యవేక్షించారు. మారీసుపేటలోని మారీసుపేటలోని అప్పలస్వామి గుడిలో ఉదయం వీరాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, పళ్లరసాలతో అభిషేకం, నాగవల్లి దళార్చన, సహస్ర నామాలతో ఆకుపూజ చేశారు. 108 సార్లు భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణ చేయించారు. ధర్మకర్తలు లంక శివానంద్ కుమార్, శివాంజనేయప్రసాద్, నారాయణస్వామి, అర్చకులు సర్వజ్ఞ పర్యవేక్షించారు. సుల్తానాబాద్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు. ఉదయం నుంచి స్వామికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. నందులపేటలోని శ్రీ సాయి అనుగ్రహ పీఠంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. సాయి గురూజీ ఆధ్వర్యంలో స్వామికి సింధూరార్చన, తమలపాకుల పూజ చేసి, భక్తులతో 27సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేయించారు. రజక చెరువు సమీపంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం, బోసురోడ్డులోని రామ మందిరం, నెహ్రూ రోడ్డులోని శ్రీరుక్మిణీ సమేత శ్రీసువర్చలా సమేత వీరప్రతాప ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు.

అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర

తెనాలి: హనుమజ్జయంతి రోజైన శనివారం సాయంత్రం పట్టణంలో నిర్వహించిన శ్రీ హనుమాన్ అట్టహాసంగా జరిగింది. శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక సుల్తానాబాద్‌లోని మార్కెట్ యార్డు సమీపంలో గల ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద సాయంత్రం 6.00 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. వందల సంఖ్యలో యువత కాషాయ జెండాలు ధరించి పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఆంజనేయ స్వామి వారిని ప్రతిష్టించి ర్యాలీగా ముందుకు కదిలారు. ముందుగా సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శోభాయాత్రవద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. జెండా ఊపి హనుమాన్ శోభాయాత్ర ర్యాలీని ప్రారంభించారు. శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ పీఠాధిపతి బాలస్వామీజీ, ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అనంతరం జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆంజనేయస్వామిని దర్శించుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్రీ హనుమాన్ శోభాయాత్ర సుల్తానాబాద్ నుండి చెంచుపేట, ఓవర్ బ్రిడ్జి మీదుగా మార్కెట్, రైల్వేస్టేషన్ వంతెన, ప్రకాశం రోడ్డు, నెహ్రూ రోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్, కొత్తపేట, దేవిచౌక్ కూడళ్ల మీదుగా బోసురోడ్డులోని శ్రీ చిట్టి ఆంజనేయ స్వామిమందిరం వరకూ కొనసాగింది.

దారిపొడవునా జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు మార్మోగాయి. శోభాయాత్ర సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూశారు. వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు కాషాయ జెండాలు చేతపట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నాయి. శ్రీ హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అనంతవరం వీరాంజనేయస్వామి శివకుమార్ పూజలు

తెనాలి: వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండలం అనంతవరం గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో స్థానిక సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. శ్రీవీరాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వినియోగాన్ని ప్రారంభించారు.పట్టణానికి చెందిన ప్రముఖులు నూకల వెంకట వేణుగోపాలరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలే పాటి హరిప్రసాద్, మాజీ వైస్‌చైర్మన గుంటూరు కోటేశ్వరరావు, వుప్పల వరదరాజులు, గుదిబండి కృష్ణకిషోర్ రెడ్డి, విశ్వేశ్వరరావు, కోగంటి ఆసు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర: వల్లభాపురం కలకట్టపై నెలకొన్న వీరాంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలో పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా భజనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా బత్తుని శివకుమార్ మండలంలోని వల్లభాపురం కరకట్టపై వేంచేసి ఉన్న శ్రీ వీర ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శతవసంతాల చిట్టి ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకారం



చిట్టి ఆంజనేయస్వామి మందిరంలో భక్తుల కోలాహలం



నృత్యకళాకారులచే హనుమాన్ చాలీసా పారాయణ నృత్యం



బాలాజీరావుపేట పట్టాభి రామస్వామి దేవస్థానంలో పూజలు

మార్కెట్లోకి బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్



బజాజ్ చేతక్ ఈవీ స్కూటర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

తెనాలి: పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని వారాహీ బజాజ్ షోరూమ్‌లో బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ విడుదల శనివారం సందడిగా జరిగింది. అత్యాధునిక టెక్నాలజీతో ఆకర్షణీయమైన రంగులలో ఉన్న బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ ను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖుల చేతుల మీదుగా మార్కెట్లోకి విడుదల చేశారు. దాల్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరు వెంకట కృష్ణమూర్తి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్ సాయిరామ్, యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్, శ్రీరామ్ ఫైనాన్స్ డీఎం వెంకటేశ్వరరావు, బజాజ్ ఫైనాన్స్ సీఎస్ఎం రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ ను మార్కెట్లోకి విడుదల చేశారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఫుల్ చార్జింగ్‌తో 126 కిలోమీటర్ల ప్రయాణం చేసే సామర్థ్యం కలిగి ఉందని, వేరే ఏ ఇతర ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో లేని అత్యాధునిక టెక్నాలజీ, స్టీల్ బాడీ సౌకర్యం కలిగి ఉందని వారాహీ బజాజ్ యాజమాన్యం, సిబ్బంది తెలిపారు. బజాజ్ చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ కావల్సిన వారికి వారాహీ బజాజ్ షోరూమ్‌లో స్పాట్ ఫైనాన్స్, స్పాట్ డెలివరీ, స్పాట్ ఎక్స్ఛేంజ్ సౌకర్యం కూడా ఉందన్నారు. వారాహీ బజాజ్ వివిధ బ్రాంచ్‌ల ఇన్‌చార్జిలు, షోరూమ్ సిబ్బంది, సబ్ డీలర్లు పాల్గొన్నారు. వారాహీ బజాజ్ షోరూమ్ ఎండీ తటవర్తి శ్రీనివాస్ స్వాగతం పలికారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ప్రారంభ ర్యాలీ



ర్యాలీలో అధికారులు సిబ్బంది

తెనాలిరూరల్: పట్టణంలోని వివిధ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలను శనివారం నిర్వహించారు. మలేరియా రహిత సమాజం ఉండాలని ఉద్దేశ్యంతో ఏటా జూన్ మాసాన్ని మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా పరిగణించి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తెనాలి పట్టణంలోని మలేరియా, ఫైలేరియా విభాగాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిపి అవగాహన ర్యాలీలను నిర్వహించారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా అధికారి ధరావత్ రాజునాయక్ మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం ఉండాలన్న సంకల్పాన్ని నెరవేర్చే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైద్యాధికారులు డాక్టర్ దివి కిషోర్ కుమార్, డాక్టర్ బీబీ జాన్, తెనాలి పట్టణ ఇంచార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, వైద్యాధికారులు డాక్టర్ మోనిక కుమార్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ దేవికవాణి, డాక్టర్ మహిత, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్‌పెక్టర్ జి.రవికుమార్ పాల్గొన్నారు.